# నాగరాజీయమ్

రాయసం వెంకట్రామయ్య


13

## పెళ్లి పెద్ద

నాగరాజు చెల్లెలు కమల. కమల మొగుడు గోపాల్రావ్. వాళ్ల కూతురు రజని. గోపాల్రావ్ తాలూకాఫీసులో గుమస్తా. వాళ్లది రావులపాలెం. కూతురికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాం రమ్మంటే నాగరాజు ఓ రోజు శలవుపెట్టి శనివారం బయల్దేరాడు బస్సులో. నాగరాజుని చూసి కమల చాలా ఆనందించింది.

''అన్నయ్యా! వాళ్లు పిల్లని చూసారు. 'వచ్చి మాట్లాడండి మిగతా విషయాలు' అని మధ్యవర్తితో కబురంపించారు. ఏదో మంచి సంబంధం అని దిగాం'' అంది నాగరాజుకి మంచినీళ్లు ఇస్తూ కమల.

''చాలా బాగుంది. మీ వదిన కూడా ఈ విషయం విని సంబరపడింది. పిల్లలిద్దరూ మీ ఇంట్లో పెళ్లి కోసం ఎదురుచూస్తున్నారు'' అన్నాడు నాగరాజు.




''ఏవండీ బావగారూ! ప్రయాణం బాగా సాగిందా. మీరు స్నానం, సంధ్యా చేసుకున్నాక అన్ని విషయాలూ చెప్తాను'' అన్నాడు గోపాల్రావ్.

ఇంతలో మధ్యవర్తి సాంబశివరావు వచ్చాడు. అతను మాటకారి.

''ఏవమ్మా కమలమ్మా! వచ్చాడా మీ అన్నయ్య? ఈ రోజు సాయంత్రం మూడు తర్వాత వర్జ్యంలేదు. బయలుదేరి తణుకు పెళ్లి మాటలు జరపడం మంచిది. శుభస్య శీఘ్రం అన్నారు పెద్దలు''

**''చూడండి విశ్వనాథం గారూ! మన దేశం బాగుపడాలంటే ఈ కట్నాలు అవీ పోవాలి. ఆడపెళ్లివారు, మగపెళ్లివారు కలసి శుభలేఖలు వేయాలి. మనకి అదృష్టం వుండాలిగానీ ఈ వెధవ కట్నంతో మేడ కడతామా ఏమిటి? వెనకటికి మా బంధువొకాయన తన కొడుకు పెళ్లికి ఒక వీశ పటిక బెల్లం కట్నం ఇమ్మన్నాడు.**

''వాళ్లభిప్రాయం ఎలా వుంటుందంటారు సాంబశివరావుగారూ?'' అడిగింది కమల.

''చూడమ్మా వాళ్లకి నాలుగు సంబంధాలు సిద్ధంగా ఉన్నాయి. పిల్లాడికి అరెకరం అరటి తోట వుంది. ఉద్యోగం ఉంది. కట్నం యాభైవేలు తక్కువ వుండదు. దానికి సిద్ధపడే ముందుకెళ్లాలి మీరు''

''కట్నం విషయం అన్నయ్య దగ్గర ఎత్తకండి. ఆయనకి ఆడపిల్లలకి కట్నం ఇవ్వడం ఇష్టంలేదు. మావారు, మీరు ఆ విషయం సంప్రదించండి'' అంది కమల నాగరాజు వినకుండా.

''అలాగైతే ఆయన్ని రావద్దంటే మంచిది'' అన్నాడు సాంబశివరావు. కమలు మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్లింది కాఫీ తేవడానికి.

భోజనాలయ్యాక ఓ గంట విశ్రమించాడు నాగరాజు. పెళ్లి మాటల కోసం మూడుగంటలకి బస్సులో వెళ్లారు నాగరాజు, గోపాల్రావ్. ముగ్గురూ వెళ్లకూడదని సాంబశివరావుని ఓ గంటముందే పంపారు. తణుకు వెళ్లాక తెలిసింది నాగరాజుకి పెళ్లికొడుకు పినతండ్రి నాగభూషణానికి బావని. నాగభూషణం నాగరాజు తోటి ఉద్యోగి.

ఇచ్చిపుచ్చుకోవడాలు మాట్లాడేటప్పుడు గోపాల్రావు, సాంబశివరావు పక్క వరండాలోకి వెళ్లారు. నాగరాజు పెళ్లికొడుకు బాబయ్యతో కబుర్లు చెప్పాడు. అతని పేరు విశ్వనాథం.

''మన పెళ్లిళ్లలో ముఖ్యమైన విషయాలకి ప్రాధాన్యత తగ్గిపోతోందండీ. అనవసరమైన ఆడంబరాలతో కొట్టుమిట్టాడుతున్నాం'' అన్నాడు నాగరాజు.

''ఏవో కొన్ని వేడుకలు తప్పవులెండి''

''నాకైతే కట్నాలివ్వడం, పుచ్చుకోవడం సుతరామూ ఇష్టం లేదండీ'' అని కొంచెం గట్టిగా అన్నాడు విశ్వనాధంతో నాగరాజు. ఈ మాటలు పెళ్లికొడుకు తండ్రి చెవిన పడ్డాయి. ఆయన గోపాల్రావుతో వెంటనే అన్నాడు.

''మీ బావగారికీ సంబంధం చేయడం ఇష్టంలేదేమో? లేకపోతే కట్నాలు పుచ్చుకోకూడదని మావాడికి లెక్చరిస్తున్నాడేమిటి?''

''అది ఆయన అభిప్రాయం. కన్యాదాతని నేను. నేను మీరెలా అంటే అలాగే చేస్తాను. కావాలంటే సాంబశివరావుగార్ని

డగండి మా సంగతి'' అన్నాడు గోపాల్రావ్ కంగారుగా. నాగరాజు మళ్లీ అందుకున్నాడు పక్కగదిలో-

''చూడండి విశ్వనాథంగారూ! మన దేశం బాగుపడాలంటే ఈ కట్నాలు అవీ పోవాలి. ఆడపెళ్లివారు, మగపెళ్లివారు కలిసి శుభలేఖలు వేయాలి. మనకి అదృష్టం వుండాలిగానీ ఈ వెధవ కట్నంతో మేడ కడతామా ఏమిటి? వెనకటికి మా బంధువొకాయన తన కొడుకు పెళ్లికి ఒక వీశ పటికబెల్లం కట్నం ఇమ్మన్నాడు. ఆయన ఎంతో సంపన్నుడు. ఆడపెళ్లివాళ్లు నిర్ఘాంతపోయారు. అలా వుండాలి''

''ఈయనెందుకు రమ్మన్నారండీ గోపాల్రావుగారూ'' విసుగ్గా అన్నాడు సాంబశివరావు. పెళ్లికొడుకు తండ్రి ఔనంటూ తలూపాడు.

''మా ఆవిడకి వాళ్లన్నయ్య రాకపోతే మనశ్శాంతిలేదు. మా బావమరిది వ్యక్తిగా చాలా మంచివాడేగానీ కొన్ని చాదస్తాలున్నాయి'' వివరించాడు గోపాల్రావు.

విశ్వనాథం నాగరాజుతో ''పెళ్లి తంతులోనే వరపూజ, ఎదురు సన్నాహం ఇవన్నీ మన పెద్దలే పెట్టారు కదండీ. అందుకని పూర్తిగా కట్నాలు, కానుకలు వద్దండానికీ వీల్లేదు'' అన్నాడు.

''పెళ్లి కుమారుడికేదో వేడుగ్గా కానుకలివ్వడంలో తప్పులేదండీ. పెళ్లికొడుకు తల్లిదండ్రులకు కట్నం ఇవ్వడంలో సమంజసంలేదు. పూర్వకాలంలో ఓ అవధానిగారు స్థాలీపాకం అయ్యేదాకా ఆడపెళ్లివాళ్లింట్లో భోజనం కూడా చేయలేదుట. అప్పటిదాకా పెళ్లికూతురు కోడలు కాదుకదా. అలా వుండాలండీ. ఎవడి ఖర్చులు వాడే భరించాలి'' అన్నాడు మళ్లీ ఉత్సాహంగా.

ఈ మాటలకి పెళ్లికొడుకు తండ్రి తోక తొక్కిన తాచులాలేచి ''మీరు మరోసారి ఆలోచించుకుని మా ఇంటికి రండి. ఏమిటిదేమైనా వేళాకోళమా? వెక్కిరింతా? ఇందాకట్నించి చూస్తున్నాను ఆయన మాటల్లో వ్యంగ్యం. మీరందరూ కలిసేగా వచ్చారు. ఆయన్ని అలా మాట్లాడమన్నది మీరేనా? మాకు గతిలేక మీ సంబంధం కోసం రాలేదు'' అన్నాడు.

గోపాల్రావు లేచి పెళ్లికొడుకు తండ్రి చేతులు పట్టుకుని ''క్షమించండి బావగారూ. ఆయన వాగుడికీ, మాకూ ఏమీ సంబంధంలేదు''.

సాంబశివరావుని ఉద్దేశించి ''ఆ మధ్య తలుపుగట్టిగా నొక్కవయ్యా''

పెళ్లికొడుకు తల్లి బుగ్గలు నొక్కుకుంటూ ''విశ్వనాథం! ఓసారి ఇలా రావయ్యా'' అంటూ లోపల్నుంచి పిలిచింది. విశ్వనాథంతో ఏమందో ఏమిటో గానీ ఆ తర్వాత విశ్వనాథం మళ్లీ నాగరాజున్న గదిలోకి రాలేదు.

పెళ్లికొడుకు తండ్రి గోపాల్రావుతో నిక్కచ్చిగా అన్నాడు ''పెళ్లిలో ఈయన ఏదైనా పేలాడంటే మాట దక్కదు సుమండీ. ముందే చెప్తున్నాను. మావాడికసలే ముక్కుమీద కోపం. వాడికి అభిమానం ఎక్కువ''

తణుకు నుండి రావులపాలెం వెళ్తున్నంతసేపూ గోపాల్రావు ముభావంగానే ఉన్నాడు. నాగరాజే అన్నాడు ''వాళ్లు మంచివాళ్లలాగే ఉన్నారు. పెళ్లికొడుకు బాబయ్య నాకు బాగా పరిచయమయ్యాడు. కట్నాలు, కానుకలమీద పెద్ద ఆసక్తి వున్నట్లు కనబడదు'' దానికి గోపాల్రావు ''ఔను' అని ఊరుకున్నాడు.

నాగరాజు తిరిగి వెళ్లాక గోపాల్రావు కమలమీద కేకలేసాడు.

''ఎంతసేపూ అన్నయ్య, అన్నయ్య అంటూ కలవరిస్తావు. మీ అన్నయ్య నిర్వాకం ఏడిసినట్టుంది. పెళ్లి మాటలకి వచ్చి పిచ్చి పిచ్చి మాటలు మొదలెట్టాడు ఆ కుర్రాడి పినతండ్రితో. కేశవరావుగారూ నామీద కసురుకున్నాడు. మీ సంబంధం అక్కర్లేదు పొమ్మంటాడేనని భయం వేసింది. మీ అన్నయ్య పెళ్లికి రాకపోతే బ్రతుకుతాం''

''అంత మాటలెందుకులెండి. అన్నయ్య మనసు మంచిది. మనమీద చాలా అభిమానం వాడికి. వాడి సంగతి తెలీందేముంది? అందుకేగా మిమ్మల్నీ, సాంబశివరావుగార్నీ కట్నం విషయం మాట్లాడమంది. ఇంతకీ మీకు చెప్పలేదు. మా అమ్మ ఇచ్చిన నాలుగు సెంట్ల స్థలం అమ్మకం పెట్టాట్ట అన్నయ్య. మనకి నలభై వేలు వస్తుందని చెప్పాడు. దాంతో పెళ్లి ఖర్చు కొంత కలిసొస్తుంది'' అంది కమల.

గోపాల్రావ్ మాట్లాడకుండా వీధిలోకి వెళ్లాడు.

(వచ్చేవారం...
రాబందుల మేళం) ★

